# గోదావరి భవిష్యత్ వార్త

గోదావరి స్పెషల్ బులిటెన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 | సంచిక : 93 | ఆగస్టు 24 సోమవారం 2026 | పేజీలు : 4 | వెల : 2 రూ.


## కొంగోడులో పంచామృత అభిషేకం



కరప (జివిఎస్‌బి వార్త) : కరప మండలం కొంగోడులో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సంప్రోక్షణ కార్యక్రమం చేశారు. ప్రతి నెల పౌర్ణమి ముందు వచ్చే ఏకాదశి రోజున స్వామివారికి పంచామృత అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఇటీవల జరిగిన ఆభరణాల అపహరణకు గురైన వస్తువులు సంప్రోక్షణ కార్యక్రమం ప్రాయశ్చిత్త హోమం చేశారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిత్య అన్నదానానికి రూ. 25 వేలు విరాళం



సామర్లకోట (జివిఎస్‌బి వార్త) : పంచారామ క్షేత్రమైన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వరాలయానికి ఆదివారం జగ్గంపేట వాస్తవ్యులు బోండా సుబ్బరాజు నిత్య అన్నదానం నిమిత్తం రూ. 25,000 లు నగదు రూపేణా ఆలయ అధికారి వారికి విరాళముగా అందజేసారు. ఈ సందర్భంగా దాతల కుటుంబం భీమేశ్వర స్వామిని బాలా త్రిపుర సుందరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ అధికారి బల్ల నీలకంఠం ఆధ్వర్యంలో వారికి శ్రీస్వామివారి తీర్థప్రసాధములు, స్వామి వారి చిత్రపటం అందజేసారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జనసేనలోకి తెలంగాణ మంత్రి కూతురు..

## ఆ పార్టీ అదిష్టానంతో చర్చలు, త్వరలోనే చేరిక..?




- జనసేనలోకి తెలంగాణ మంత్రి కూతురు
- ఆ పార్టీ అదిష్టానంతో కొండా సుస్మిత చర్చలు
- త్వరలోనే జనసేనలో చేరుతారంటూ ప్రచారం

హైదరాబాద్ (జివిఎస్‌బి వార్త) : తెలంగాణ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత ఎపిసోడ్ రోజు రోజుకూ ఆసక్తిని రేపుతోంది. తాజాగా.. ఆమె జనసేనలో చేరబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, పరకాల టికెట్ అంశం, సీఎం రేవంత్‌రెడ్డిపై ఆమె చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ చర్చ మొదలైంది. జనసేన నేతలతో సుస్మిత చర్చలు జరుపుతున్నారనే ప్రచారం ఉన్నప్పటికీ.. ఆమె నుంచి కానీ జనసేన నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఆమె చేరికపై ఉత్కంఠ కొనసాగుతోంది.

తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. ఇటీవల మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మితతో పాటు రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డి వంటి నేతలు సొంత పార్టీపై విమర్శలు చేశారు. తాజాగా.. రాష్ట్ర రాజకీయాల్లో మరో ఆసక్తికర ప్రచారం తెరపైకి వచ్చింది. మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత త్వరలో జనసేన పార్టీలో చేరబోతున్నారంటూ రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న అంతర్గత పరిణామాలు, పరకాల రాజకీయాల నేపథ్యంలో ఆమె జనసేన వైపు అడుగులు వేస్తున్నారనే ప్రచారం ఊపందుకుంది. అయితే ఈ ప్రచారాన్ని సుస్మితగానీ, జనసేనగానీ ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు.

కొండా కుటుంబానికి కాంగ్రెస్ నేతలతో పొసగటం లేదు. పరకాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలన్న సుస్మిత ఆకాంక్ష ఈ పరిణామాలకు కేంద్రంగా మారినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో పరకాల టికెట్ తనకు దక్కాలని ఆమె కోరుకుంటున్నారు. తానే అక్కడి నుంచి పోటీ చేస్తానని.. పార్టీ నుంచి అవకాశం రాకపోతే స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతానని ఇప్పటికే ప్రకటించారు. ఇదే సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలో వివాదానికి దారితీశాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసులు జారీ చేసింది. దీనిపై మంత్రి సురేఖ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి వివరణ ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

తాజాగా ఈ పరిణామాలకు జనసేన అంశం కూడా జత కావడంతో ఆసక్తి మరింత పెరిగింది. తెలంగాణలో తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకునే దిశగా జనసేన క్రమంగా కార్యాచరణను విస్తరిస్తోంది. ముఖ్యంగా యువత, కొత్త రాజకీయ శక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న వ్యూహంలో భాగంగా పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే సుస్మితతో జనసేన నేతలు చర్చలు జరుపుతున్నారనే ప్రచారం తెరపైకి వచ్చింది. ఇటీవల వైద్యారోగ్య శాఖ మాజీ డైరెక్టర్ గడల శ్రీనివాస్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన ప్రకటించడం కూడా తెలంగాణలో పార్టీ విస్తరణపై చర్చకు దారితీసింది.

రాష్ట్రంలో పార్టీకి సంస్థాగత బలం పెంచడంతోపాటు వివిధ సామాజిక, రాజకీయ వర్గాల్లో గుర్తింపు ఉన్న నేతలను తమవైపు తీసుకురావడానికి జనసేన ప్రయత్నిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందులో భాగంగానే ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కొండా కుటుంబం నుంచి సుస్మితను పార్టీలో చేర్చుకునేందుకు జనసేన ఆసక్తి చూపుతుందనే ప్రచారం జరుగుతోంది. అయితే సుస్మిత జనసేనలో చేరికపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఒకవేళ సుస్మిత జనసేనలో చేరితే కొండా దంపతులు కుటుంబం కాంగ్రెస్‌లోనే కొనసాగుతారా? లేక కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తారా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# ఏపీ ఆయుష్‌కు రూ.185.75 కోట్ల కేంద్ర నిధులు

## మూడేళ్లలో రూ.434 కోట్ల కేటాయింపులకు ఆమోదం

## జాతీయ ఆయుష్ మిషన్ తర్వాత ఇదే అత్యధిక వార్షిక కేటాయింపు

## వైద్య సేవల విస్తరణకు నిధులు వినియోగం

హైదరాబాద్ (జివిఎస్‌బి వార్త) : ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్ వైద్య రంగ అభివృద్ధికి కేంద్రం భారీగా నిధులు మంజూరు చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 185.75 కోట్లతో రూపొందించిన ఆయుష్ వార్షిక ప్రణాళికకు కేంద్ర ఆయుష్ మిషన్ డైరెక్టరేట్ ఆమోదం తెలిపింది. జాతీయ ఆయుష్ మిషన్ ప్రారంభమైన తర్వాత రాష్ట్రానికి లభించిన అత్యధిక వార్షిక కేటాయింపులు ఇవేనని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆయుష్ చరిత్రలో తొలిసారిగా 2024-25 నుంచి 2026-27 వరకు మూడేళ్ల కాలానికి కలిపి రూ. 434 కోట్ల నిధులకు కేంద్రం అనుమతి ఇచ్చింది. గతంలో 2014-15 నుంచి 2023-24 వరకు పదేళ్లలో కేవలం రూ. 120.17 కోట్లు మాత్రమే కేటాయించగా.. ప్రస్తుతం మూడేళ్లలోనే భారీగా నిధులు మంజూరు కావడం విశేషం. ఈ నిధులతో రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలను మరింత విస్తరించి, ప్రజలకు ప్రత్యామ్నాయ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

**కన్వీనర్ కోటా సీట్లకు ప్రొవిజనల్ లిస్ట్**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ప్రొవిజనల్ ప్రయారిటీ లిస్ట్‌ను విడుదల చేసింది. మొత్తం 14,310 మంది అభ్యర్థులు జాబితాలో ఉండగా.. మరో 382 మంది ఫీజు చెల్లించినప్పటికీ అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేయలేదు. వీరికి నిర్ణీత గడువులోగా పత్రాలు సమర్పించే అవకాశం కల్పించారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది ప్రాధాన్య జాబితా, ఆప్షన్లు ప్రకటించనున్నారు.

**బ్యాంకు ఖాతాల మార్పుపై ఉద్యోగులకు హెచ్చరిక**

జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలోని ఉద్యోగులు సరైన కారణం లేకుండా బ్యాంకు ఖాతాలను మార్చుకోవద్దని రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ సూచించింది. ఆధార్ సీడింగ్ పూర్తికాకముందే ఖాతాలు మార్చితే ఆధార్ ఆధారిత చెల్లింపు విధానం (ఏబీపీఎస్), డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ)లో సాంకేతిక సమస్యలు తలెత్తి జీతాల చెల్లింపుల్లో జాప్యం జరిగే అవకాశం ఉందని తెలిపింది.

## తిరుపతి స్విమ్స్ వైద్య విద్యార్థుల కోసం..


# కదిలివచ్చిన రోబోటిక్ ల్యాబ్




తిరుపతి (జివిఎస్‌బి వార్త) : తిరుపతి స్విమ్స్ ఆవణలో ఒక వినూత్న కార్యక్రమం జరుగుతోంది. రెండు రోజుల పాటు పీజీ విద్యార్థులకు రోబోటిక్, లాపరస్కోపిక్ సర్జరీలపై ఉచితంగా డెమో ఇస్తున్నారు. ఢిల్లీ నుంచి ఓ ఏసీ బస్సులో ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుంది. స్విమ్స్‌లోని జనరల్ సర్జరీ, గైనకాలజీ సర్జికల్ ఆంకాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాలకు చెందిన డాక్టర్లు, పీజీ విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లకు ఈ బస్సులో శిక్షణ ఇచ్చరు. ఆపరేషన్ సమయంలో ఉపయోగపడే వాటి గురించి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. మారుతున్న కాలం కొద్దీ అన్ని రంగాలు అప్డేట్ అవుతున్నాయి. ఏఐ రాకతో కేవలం కంప్యూటర్ సైన్స్ రంగమే కాకుండా అన్ని రంగాల్లోనూ వినూత్నమైన మార్పులు వచ్చాయి. ముఖ్యంగా వైద్య రంగంలో కూడా పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. వైద్య రంగంలో వస్తున్న అత్యాధునిక సాంకేతిక మార్పులను పీజీ వైద్య విద్యార్థులకు చేరువ చేసేందుకు తిరుపతి స్విమ్స్ ఆవరణలో ఓ వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీ నుంచి ప్రత్యేకంగా తిరుపతి చేరుకున్న ఓ బస్సు అందర్నీ ఆకట్టుకుంది. పైకి బస్సులా కనిపిస్తున్న దాని లోపలికి వెళ్తే అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, శిక్షణ కేంద్రాన్ని తలపించేలా ఉన్న ఓ మొబైల్ ల్యాబ్ యువ వైద్యులకు భవిష్యత్ ఆపరేషన్స్‌పై దిశానిర్దేశం చేసింది. ఈ ఏసీ బస్సులో రెండు రోజుల పాటు పీజీ విద్యార్థులకురోబోటిక్, లాపరోస్కోపిక్ సర్జరీలపై ఉచితంగా డెమో అందించనున్నారు. ఇప్పుడున్న రోజుల్లో క్రిటికల్ ఆపరేషన్లను కూడా ఈజీ చేసేందుకు రోబోటిక్ సర్జరీలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్విమ్స్‌లోని జనరల్ సర్జరీ, గైనకాలీ, సర్జికల్ ఆంకాలజీ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగంగాలకు చెందిన డాక్టర్లు, పీజీ విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లకు ఈ బస్సులో శిక్షణ ఇచ్చారు. ఇందులో ఏర్పాటు చేసిన ప్రత్యేక రోబోటిక్ కన్సోల్స్, త్రీడీ స్క్రీన్లు, హ్యూగో రాస్ సర్జికల్ సిమ్యులేటర్ల ద్వారా ఆపరేషన్ సమయంలో అవయవాలను ఎలా గుర్తించాలి, రోబోటిక్ చేతులను ఎలా నియంత్రించాలి అనే దానిపై నిపుణులకు శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు 60 నుంచి 80 మందికి పైగా వైద్యులు, విద్యార్థులు అవగాహన పెంచుకున్నట్లు తెలుస్తోంది. రోబోటిక్ సర్జరీలపై శిక్షణ పొందాలంటే భారీ ఖర్చుతో కూడుకున్న పని.. కానీ, ఇలా నేరుగా కళాశాల వద్దకే వచ్చి అత్యాధునిక పరికరాలతో కూడిన బస్సులో ట్రైనింగ్ ఇవ్వడం విశేషం. రెండు రోజుల పాటు ఉచితంగా ఇవ్వనున్న ఈ డెమోను పీజీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచిస్తున్నారు. వైద్య రంగంలో రానున్న కాలానికి ఉపయోగపడతాయని చెబుతున్నారు.

## బధిర విద్యార్థులకు డిగ్రీ కోర్సులు ప్రారంభం

## తొలి ఏడాది 30 సీట్లతో బీకాం కంప్యూటర్స్




బాపట్ల (జివిఎస్‌బి వార్త) : బధిర విద్యార్థుల కోసం ప్రభుత్వం తొలిసారిగా ప్రారంభించిన డిగ్రీ కళాశాలలో కోర్సులకు ఆహ్వానం పలికింది. బీకాం కంప్యూటర్ సైన్స్‌లో 30 సీట్లతో ప్రవేశాలకు శ్రీకారం చుట్టారు. ఈ అవకాశాన్ని బధిర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల జిల్లా వెదుళ్లపల్లి బధిరుల కళాశాల ప్రిన్సిపల్ కోరారు. అర్హులు సంబంధిత సర్టిఫికెట్లతో కాలేజీ దగ్గరకు వచ్చి అడ్మిషన్స్ పొందాలని సూచించారు. సందేహాలు ఉంటే 9000013633 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు బధిర విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు మాత్రమే మన దగ్గర కోర్సులు ఉన్నాయి. (తరువాయి 2వ పేజీలో)

# దుర్గగుడికి దశాబ్దం తర్వాత మహర్దశ

- ఇంద్రకీలాద్రి దగ్గరలో అన్నదానం
- ప్రసాదం తయారీ భవనాలు



విజయవాడ (జివిఎస్‌బి వార్త) : 2016లో కొండపై అన్నదానం, ప్రసాదం తయారీ భవనాలను కూలగొట్టారు. ఇప్పుడు ఆ భవనాలను కొండ కింది భాగంలో నిర్మించారు. అమ్మవారిని దర్శించుకుని కొండ దిగేటప్పుడే ఈ భవనాలను నిర్మించారు. అన్నదాన భవనానికి రూ. 26 కోట్లు, ప్రసాద భవనానికి రూ. 26.5 కోట్లతో మొత్తం రూ. 52.50 కోట్లు వెచ్చించారు. ఈ రెండు భవనాలను కనకదుర్గా నగర్‌లో నిర్మించారు. అన్నదానం కేంద్రం ద్వారా ఇకపై ఎంత మంది వచ్చినా భోజనం చేసే సౌకర్యం ఉందని అధికారులు అంటున్నారు. బెజవాడ దుర్గమ్మ గుడికి పదేళ్ల తర్వాత మహర్దశ పట్టింది. ఇంతకాలం ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేయాలంటే కొండ దిగువన మాత్రమే అవకాశం ఉంది. పదేళ్ల కిందట అంటే 2016లో కొండపై ఉన్న అన్నదానం భవనాలను కూలగొట్టారు. అప్పటి నుంచి కొండ దిగువన మహామండపంలో అన్నదానం పెడుతున్నారు. అదే విధంగా ప్రసాదం కూడా వేరే చోట తయారు చేసుకొచ్చి కొండమీద విక్రయిస్తున్నారు. ఎట్టకేలకు ఇప్పుడు ఆ అన్నదానం, ప్రసాదం తయారీకి ఆలయ ఆధ్వర్యంలో సొంత భవనాలను నిర్మించారు. పదేళ్ల తర్వాత రూ. 52.50 కోట్లతో ఈ రెండు భవనాలను పూర్తి చేసి లాంఛనంగా ప్రారంభించేందుకు సన్నాహాలు కూడా చేశారు. అన్నదాన భవనానికి రూ. 26 కోట్లు, ప్రసాద భవనానికి రూ. 26.50 కోట్లు వెచ్చించారు. ప్రస్తుతం ఈ రెండు నూతన భవనాలను కొండ దిగువన కనకదుర్గా నగర్‌లో నిర్మించారు. భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుని కిందకు వచ్చే మార్గంలోనే అన్నదాన భవనం ఉంది. దసరా సహా ఆలయంలో జరిగే ప్రధాన వేడుకల సమయంలో ఎన్ని లక్షల మంది భక్తులొచ్చినా అందరికీ అన్నదానం చేసేలా ఈ భవనాన్ని సిద్ధం చేశారు. అన్నదాన భవనంలో ఒకేసారి కనీసం 800 మంది భోజనం చేసేలా ఏర్పాట్లు చేశారు. ఇకపై ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని ఆలయ అధికారులు అంటున్నారు. అన్నదాన భవనానికి శ్రీకనకదుర్గ అన్నప్రసాద సదనం, ప్రసాదాల తయారీ భవనానికి శ్రీదుర్గాభవానీ మహాప్రసాద భవనం అనే పేర్లను అధికారికంగా నిర్ణయించారు. పదేళ్ల తర్వాత అమ్మవారి ఆలయానికి సంబంధించి శాశ్వత భవనాలు నిర్మించడం సంతోషంగా ఉందని ఆలయ అధికారులు అంటున్నారు.

# గవర్నమెంట్ హాస్టల్స్‌లో సకల సౌకర్యాలు

## స్టూడెంట్స్ హాయిగా చదువుకోవచ్చు!



అమరావతి (జివిఎస్‌బి వార్త) : ప్రభుత్వ హాస్టల్స్‌లో సకల సౌకర్యాలు కల్పించి స్టూడెంట్స్ చదువుకోవడానికి అనువుగా ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో 25 వసతి గృహాలను రూ. 86 కోట్ల నిధులతో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. కోర్టు కేసు కారణంగా ఒకటి అర్థంతరంగా ఆగిపోగా.. మిగతావి నిర్మాణంలో ఉన్నాయి. అందులో 18భవనాలు సెప్టెంబర్ నెలాఖరునాటికి విద్యార్థులకు అందుబాటులోకి రానున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఒక్కో భవనానికి రూ. 3నుంచి రూ. 6కోట్ల వరకు ఖర్చు చేయనున్నారు. (తరువాయి 2వ పేజీలో)

# విశాఖపట్నం టు భోగాపురం

## ఆర్టీసీ ఏరో ఎక్స్‌ప్రెస్‌లు ప్రారంభం

**విశాఖ నుంచి భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు బస్సులు ప్రారంభం**

**రెండు రూట్‌లలో ప్రతి అరగంటకు ఒక ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సు**

**మొత్తం 20 బస్సుల్ని అందుబాటులోకి తీసుకొచ్చారు**

విశాఖపట్నం (జివిఎస్‌బి వార్త) : విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు 20 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆదివారం రోజు బస్సులు ప్రారంభించగా.. నేటి నుంచి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. ASR-1, ASR-2 పేర్లతో రెండు రూట్లలో ఈ బస్సుల్ని నడిపిస్తున్నారు.. టికెట్ ధరల్ని కూడా ఖరారు చేశారు. ప్రతి అరగంటకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని చెబుతున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి విమాన సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఇవాళ ఇండిగో విమానం హైదరాబాద్ నుంచి భోగాపురానికి వచ్చింది.. అధికారులు ప్రయాణికులకు ఘన స్వాగతం పలికారు. భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విమానాల రాకపోకలు మొదలు కావడంతో.. విశాఖపట్నం నుంచి భోగాపురానికి ఆర్టీసీ ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి 30 నిమిషాలకు ఒక ఆర్టీసీ ఏరో ఎక్స్‌ప్రెస్ ఏసీ బస్సు అందుబాటులో ఉంటుందని అధికారులు తెలిపారు. పాతగాజువాక నుంచి మద్దిలపాలెం మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ఉదయం 4.55 గంటలకు తొలి సర్వీసు ఉంటుంది.. ఇదే రూట్‌లో రాత్రి7.45 గంటలకు చివరి బస్సు బయల్దేరుతుంది. ఆర్టీసీ ఈ ఏరో ఎక్స్‌ప్రెస్ బస్సుల్ని ASR-1, ASR-2 పేర్లతో రెండు మార్గాల్లో అందుబాటులో ఉంటాయి. ASR-1 రూట్‌లో.. 'గాజువాక, ఎన్ఏడీ, గురుద్వార్, జూ పార్క్, మారికవలస, ఆనందపురం, తగరపువలస, ఎయిర్‌పోర్టు జంక్షన్ మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ఈ సర్వీసు చేరుకుంటుంది' అని ఆర్టీసీ అధికారులు తెలిపారు. బస్సు ఛార్జీల విషయానికి వస్తే 'పాత గాజువాక నుంచి భోగాపురం విమానాశ్రయానికి రూ. 400, ఎన్ఏడీ జంక్షన్ నుంచి రూ. 350, గురుద్వార్ నుంచి రూ. 300, జూ పార్క్ నుంచి రూ. 250, మారికవలస నుంచి రూ. 200, ఆనందపురం నుంచి రూ. 150, తగరపువలస నుంచి రూ. 100, ఎయిర్‌పోర్టు జంక్షన్ నుంచి రూ. 50'గా నిర్ణయించారు. ASR-2 రూట్‌లో 'గాజువాక, సింధియా, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్, సిరిపురం, ఇస్కాన్ టెంపుల్, ఐటీ హిల్స్, మారికవలస, ఆనందపురం, తగరపువలస, ఎయిర్‌పోర్టు జంక్షన్' మీదుగా విమానాశ్రయానికి బస్సులు చేరుకుంటాయి. ఈ రూట్‌లో బస్సు ఛార్జీలు.. 'పాత గాజువాక నుంచి ఎయిర్‌పోర్ట్‌కు రూ. 400, సింధియా నుంచి రూ. 400, కంచరపాలెం నుంచి రూ. 400, సిరిపురం నుంచి రూ. 350, ఇస్కాన్ టెంపుల్ నుంచి రూ. 300, ఐటీ




హిల్స్ నుంచి రూ. 250, మారికవలస నుంచి రూ. 200, ఆనందపురం నుంచి రూ. 150, తగరపువలస నుంచి రూ. 100, ఎయిర్‌పోర్టు జంక్షన్ నుంచి రూ. 50'గా నిర్ణయించారు. ఉదయం 4:30 నుంచి రాత్రి వరకు బస్సులు అందుబాటులో ఉంటాయంటున్నారు. విమాన ప్రయాణికులు బస్సు రూట్లు, ఛార్జీల వివరాలను గమనించాలని సూచించారు.


# విశాఖపట్నానికి రూ. వెయ్యి కోట్లతో తాగునీరు..

## గోదావరి నుంచి నేరుగా నగరానికి

**పోలవరం ఎడమ కాలువ ద్వారా కేబీఆర్‌కు నీరు**

**పైపులైన్ ద్వారా మధురవాడ పరిసరాలకు సరఫరా**

**టెండర్లు పిలిచి త్వరగా పూర్తి చేసేలా మంత్రి చర్యలు**



విశాఖపట్నం (జివిఎస్‌బి వార్త) : ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న నగరం ఏది అని అడిగితే విశాఖ అనే చెప్తారు. భవిష్యత్‌లో వైజాగ్‌కు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం రూ వెయ్యి కోట్లు ఖర్చు చేయనుంది. గోదావరి నుంచి నేరుగా నగరానికి తాగునీరు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇదే విషయాన్ని మంత్రి నారాయణ కూడా స్పష్టం చేశారు. ఇప్పటికే టెండర్లు పిలిచిన ప్రభుత్వం అతి త్వరగానే (తరువాయి 2వ పేజీలో)

# తిరుమల శ్రీవారి సేవలో జాన్వీకపూర్, రుక్మిణీ వసంత్

తిరుమల (జివిఎస్‌బి వార్త) : తిరుమల శ్రీవారి సేవలో సినీ నటి జాన్వీ కపూర్ పాల్గొన్నారు. ఆమె వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. శుక్రవారం జాన్వీ పుట్టినరోజు కావడంతో తన పిన్ని, నటి మహేశ్వరితో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. దర్శన అనంతరం పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. 'కాంతార-చాప్టర్ 1' ఫేమ్, నటి రుక్మిణీ వసంత్ కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. వీరితో ఫోటోలు దిగేందుకు భక్తులు పోటీపడ్డారు.

# బధిర విద్యార్థులకు డిగ్రీ కోర్సులు ప్రారంభం

## తొలి ఏడాది 30 సీట్లతో బీకాం కంప్యూటర్స్

(మొదటి పేజీ తరువాయి) తొలిసారి డిగ్రీ కోర్సులు కూడా బోధించాలని విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బాపట్ల జిల్లా వెదుళ్లపల్లిలో ఉన్న బధిరుల ఆశ్రమ పాఠశాల, జూనియర్ కళాశాలలోనే ఇకపై డిగ్రీ కళాశాలను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు జూలై 22న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆశ్రమ పాఠశాల, జూనియర్ కళాశాలలోని తాత్కాలిక భవనాల్లోనే ప్రస్తుతం డిగ్రీ కళాశాలను ప్రారంభించారు. తొలి ఏడాది బీకాం కంప్యూటర్ సైన్స్‌లో 30 సీట్లతో ప్రవేశాలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ మేరకు అధ్యాపకుల నియామకం, వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. కళాశాల ప్రిన్సిపల్ రజియా మాట్లాడుతూ బీకాం కంప్యూటర్స్‌లో చేరిన విద్యార్థులకు ఉచిత వసతి, భోజన సౌకర్యం, పాఠ్య, రాత పుస్తకాలు, కాస్మొటిక్స్ ఖర్చులకు నగదు, వినికిడి పరకాలు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. అర్హత ఉన్న బధిర విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ రజియా తెలిపారు. అర్హులు సంబంధిత సర్టిఫికెట్లతో కాలేజీ దగ్గరకు వచ్చి అడ్మిషన్స్ పొందాలని సూచించారు. సందేహాలు ఉంటే 9000013633 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని బధిర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి 1987లో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు బధిరుల కోసం ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేశారు. 14 ఎకరాల విస్తీర్ణంలో బధిరుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని వెదుళ్లపల్లిలో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. 1987లో ఎన్టీఆర్ బధిరుల ఆశ్రమ పాఠశాలను ప్రారంభించగా.. 1990లో చంద్రబాబు నాయుడు హయాంలో ఆశ్రమ పాఠశాలకు జూనియర్ కళాశాల హోదా కల్పించారు. మళ్లీ 2026లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే డిగ్రీ కళాశాలగా చేయడం విశేషం. బధిర విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మరింత ఎత్తుకు ఎదగాలనేదే ప్రభుత్వం ఆకాంక్ష.

# గవర్నమెంట్ హాస్టల్స్‌లో సకల సౌకర్యాలు

(మొదటి పేజీ తరువాయి) ఒకప్పుడు గవర్నమెంట్ హాస్టల్స్‌లో చదువుకోవాలంటేనే అక్కడి వాతావరణం చూసే భయమేసేది. సరైన వసతులు ఉండేవే కావు.. ఆహారం కూడా నాణ్యత ఉండేది కాదు. మరి ఇప్పుడు ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక దృష్టిసారించడం.. ప్రభుత్వ హాస్టల్స్‌లో మెరుగైన వసతులు కల్పించడంతో విద్యార్థులు చాలా సంతోషంగా హాస్టల్స్‌లో ఉంటున్నారు.

గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా రూ. 86 కోట్లతో 25 వసతిగృహాల పనులు ప్రారంభించగా.. అందులో ఆరు భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. కోర్టు కేసు కారణంగా కృష్ణా జిల్లా మొవ్వలో హాస్టల్ నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయింది. మిగతా 18 భవనాలు సెప్టెంబర్ నెలాఖరు నాటికి విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. ముఖ్యంగా ఎస్సీ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

పీఎం అజయ్ పథకం కింద రాష్ట్రానికి రూ. 86 కోట్ల నిధులు వచ్చాయి. తొలి విడతలో 25 హాస్టళ్లను గుర్తించి కేంద్రానికి నివేదిక ఇవ్వగా.. వారు నిధులు మంజూరు చేశారు. ఒక్కో భవనానికి రూ. 3 – 6 కోట్లు వెచ్చిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చదువుకునేందుకు విశాలమైన స్టడీ రూములు, భోజనాలు చేసేందుకు డైనింగ్ హాళ్లు, వంటగదులు, స్నానపు గదులు, మరుగుదొడ్లు అన్నింటిని నిర్మించనున్నారు.

ఇప్పటి వరకు రాష్ట్రంలో ఆరు వసతిగృహాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. గజపతి నగరం, రాయదుర్గం (కణేకల్లు), పామర్రు, ప్రొద్దుటూరు, కలసపాడు (కడప జిల్లా), నందికొట్కూరులో వసతి గృహాలు పూర్తయ్యారు. విశాఖలోని మహారాణిపేట, భీమునిపట్నంలోని కుమ్మరిపాలెం, ఎస్.కోట, పార్వతీపురం, మైలవరం, విస్సన్నపేట, గుండుగొలను (ఏలూరు జిల్లా), అమృతలూరు (బాపట్ల), మాచర్ల, ఒంగోలు, యర్రగొండపాలెం, గూడూరు (కర్నూలు), కృష్ణగిరి (కర్నూలు), ఆత్మకూరు (నంద్యాల), పలమనేరు (2), మనుబోలు (నటటల్లూరు), చంద్రగిరి. ఒక వంద మంది విద్యార్థులు ఉండే వసతిగృహాన్ని రూ. 3 కోట్లతో నిర్మిస్తున్నారు. అందులో విశాలమైన ఏడు గదులు, ఒక డైనింగ్ హాల్, 16 స్నానపు గదులు, 12 మరుగుదొడ్లు ఉండేలా ఇంజినీర్లు ప్లాన్ ఇచ్చారు. ఇక భవిష్యత్‌లో ప్రభుత్వ హాస్టల్‌కు వచ్చేందుకు విద్యార్థులు మొగ్గుచూపడం ఖాయం.

# విశాఖపట్నానికి రూ. వెయ్యి కోట్లతో తాగునీరు..

## గోదావరి నుంచి నేరుగా నగరానికి

(మొదటి పేజీ తరువాయి) ఈ ప్రాజెక్టును పూర్తి చేసి విశాఖ వాసుల తాగునీటి కష్టాలు తీర్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. విశాఖపట్టణం ప్రజలకు ఇది శుభవార్తే అని చెప్పొచ్చు. నీటి కష్టాలతో ఇబ్బంది పడుతున్న విశాఖ నగరానికి ఉపశమనం కలిగించే వార్తను రాష్ట్ర ప్రభుత్వం అందించింది. గోదావరి జలాలను నగరానికి తరలించడంతో పాటు నగరంలో నీటి సరఫరాను మరింత మెరుగుపరిచేందుకు రూ. వెయ్యి కోట్లతో ప్రణాళికలను ప్రభుత్వం సిద్ధం చేసింది. మురుగునీటిని శుద్ధి చేసి పరిశ్రమల అవసరాలను తీర్చేందుకు మరో రూ. 1,500 కోట్లతో ఎస్‌టీపీల నిర్మాణానికి ప్రణాళికలు రచిస్తున్నట్లు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ప్రకటించారు.

జీవీఎంసీ పరిధిలో ప్రస్తుతం 24 లక్షల జనాభా ఉంటోంది. సెంట్రల్ పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీరింగ్ ఆర్గనైజేషన్ ప్రమాణాల ప్రకారం రోజుకు 135 లీటర్ల నీటిని కచ్చితంగా సరఫరా చేయాలి. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలోని 24 లక్షల మంది జనాభా ఉండటంతో ప్రతి రోజూ 320 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే, నగరానికి తాగునీటి సరఫరా చేసే రెండు చిన్నపాటి రిజర్వాయర్లు మాత్రమే ఉండటంతో ఏలేశ్వరం, తాటిపూడి, రైవాడ రిజర్వాయర్లతో పాటు గోదావరి నదిలో బోర్ల ద్వారా నీటిని తోడి నగరానికి సరఫరా చేస్తున్నారు. ఇన్ని చేస్తున్నా రోజుకి 180 ఎంఎల్‌డీ మించి నీటిని తరలించే అవకాశం లేకుండా పోతోంది.

ప్రస్తుతం విశాఖపట్టణం మరింత అభివృద్ధి చెందుతున్న నగరంగా మారుతుంది. గూగుల్ డేటా సెంటర్ రాకతో భవిష్యత్‌లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు వైజాగ్‌కు వచ్చే అవకాశం ఉంది. దాంతో విశాఖకు నీటి కష్టాలు పెరిగే అవకాశం ఉంది. దాంతో రానున్న భవిష్యత్‌ను ముందుగానే అంచనా వేసి రూ. వెయ్యి కోట్లతో నగరానికి తాగునీటి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి నారాయణ ప్రకటించారు.

# శ్రీవారి సేవలో సీబీసీఐడీ

## ఎస్పీ రెడ్డి గంగాధర్



ఆత్రేయపురం (జిఎస్‌బి వార్త) : కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని విజయవాడకు చెందిన సీబీసీఐడీ ఎస్పీ శ్రీరెడ్డి గంగాధర్ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. శ్రీ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ మర్యాదలతో స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# ఆంధ్ర కేసరి టంగుటూరి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

## – ఆర్డీవో కె ఆనంద రావు



రాజమహేంద్రవరం (జిఎస్‌బి వార్త) : ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఆదివారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వూరు ఆర్డీవో కే. ఆనందరావు టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కే. ఆనందరావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుడిగా, న్యాయవాదిగా, రాజకీయ నాయకుడిగా టంగుటూరి ప్రకాశం పంతులు ప్రజలకు విశేష సేవలందించారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగిన స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు చిరస్మరణీయమన్నారు. సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమ సమయంలో బ్రిటిష్ పోలీసుల తుపాకులకు ఎదురుగా నిర్భయంగా నిలబడి ప్రజల్లో స్ఫూర్తి నింపారని పేర్కొన్నారు. అందుకే ప్రజలు ఆయనను లిలి“ఆంధ్ర కేసరి”లిలిగా గౌరవించారని తెలిపారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా దేశానికి సేవలందించడంతో పాటు మద్రాస్ ప్రెసిడెన్సీ ముఖ్యమంత్రిగా, అనంతరం ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు ప్రజా సేవలో తనదైన ముద్ర వేశారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో ప్రజాసేవలో నిబద్ధత, నిజాయితీ, ధైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరేట్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని టంగుటూరి ప్రకాశం పంతులకు ఘనంగా నివాళులర్పించారు.

# జిల్లా గౌరీ (గవర) సేవా సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



కోరుకొండ (జిఎస్‌బి వార్త) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరీ గవర సేవా సంఘం నూతన కార్యవర్గం ఆదివారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నం గ్రామంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరీ గౌర సేవా సంఘం అధ్యక్షుడిగా తనకాల వెంకటరమణ పదవి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు యు ద ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో వచ్చినటువంటి గౌరీ గౌర సంఘం నాయకులను ఘనంగా సత్కరించారు. నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షుడిగా తనకాల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఆదారి నాగేశ్వరరావు, కోశాధికారి ఎల్లపు వరాహ జగన్మోహన్రావు, గౌరవ అధ్యక్షులు శ్రీ కాళ్ల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఆరుగురు, జాయింట్ సెక్రటరీలు ఆరుగురు ఎంపికయ్యారు. అదే విధంగా పెద్ద సంఖ్యలో గౌరవ సలహాదారులు కోఆర్డినేటర్లు గ్రామ కార్యదర్శులను నియమించారు. వీరందరి చేత సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకుడు తనకాల నాగేశ్వరరావు పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు తనకాల వెంకటరమణ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి కూడా వచ్చి గౌరీ గౌర సంఘం యొక్క పదవీ ప్రమాణస్వీకారంలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం అన్నివేళలా అందుబాటులో సంఘస్తుల యొక్క సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. బుద్ధ ఈశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. పెంటకోట భాస్కర సత్యనారాయణ, మల్ల తులసీరామ్ గార్లను ఘనంగా సత్కరించారు. జిల్లా అధ్యక్షుడు తనకాల వెంకటరమణ దంపతులను జీపుపై ఊరేగిస్తూ వేదిక వద్దకు గ్రామస్తులు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. అదేవిధంగా అనకాపల్లి మాజీ ఎంపీ డాక్టర్ బీశెట్టి సత్యవతి దంపతులు విచ్చేశారు .వారిని ఘనంగా సత్కరించారు .పెద్ద సంఖ్యలో హాజరైనటువంటి సంఘస్తులను మెమొంటోలు అందించి సాలువాలతో సత్కరించారు .ఈ కార్యక్రమంలో మద్దాల రమణ, పెనకటి గంగాధర్ రావు, కోయిడాల నానాజీ, తనకాల నూకరాజు,పెనకటి శివాజీ, మద్దాల కృష్ణార్జున, పొలిమేర శివరామకృష్ణ, పొలామర శెట్టి వీరబాబు, పెంటకోట సూర్యనారాయణ, పెంటకోట సూర్యనారాయణ (దత్తుడు), సూరిశెట్టి మహేష్, రాపేటి సూర్యచంద్రం,

# శ్రీ సరస్వతీదేవిగా వనదుర్గమ్మ



## రెండవరోజు ఘనంగా పూజలు, హోమాలు

అన్నవరం (జిఎస్‌బి వార్త) : రత్నగిరి వనదేవతగా పూజలందుకుంటున్న వనదుర్గమ్మ తల్లి ఆలయంలో శ్రావణమాస జాతర మహోత్సవాలు రెండవ రోజైన ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. శ్రావణ శుద్ధ ఏకాదశి ఆదివారం అమ్మవారు చదువుల తల్లి, పరబ్రహ్మ స్వరూపిణి సరస్వతీ దేవిగా భక్తులకు దర్శణమిచ్చారు.ఆలయంలో అమ్మవారికి చండీహోమం, లక్ష కుంకుమార్చన వైభవంగా నిర్వహించారు.ఉదయం 8.30 గంటల నుండి గణపతి పూజలు, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరుణలు, మంటపారాధన, నవగ్రహలింగార్చన, జపములు, చండీపారాయణలు, మూలమంత్రజపములు, నవవరార్చన, సూర్యనమస్కారములు, కౌముధిపూజలు (బాల), సువాసినీ పూజ, కలశస్థాపన, మండపారాధన తదితర పూజలు ఘనంగా నిర్వహించారు.

### సరస్వతీదేవి అవతారంలో అమ్మవారు

శ్రావణమాస జాతర హోత్సవాలలో భాగంగా ఈనెల 28 వరకూ వనదుర్గమ్మ తల్లి వివిధ అవతారాలలో భక్తులకు దర్శణమిస్తారు.ఆదివారం సరస్వతీదేవిగా దర్శణమిచ్చిన అమ్మవారు,24 తేధీన శ్రీ అన్నపూర్ణా దేవి, 25 తేధీన శ్రీ మహాలక్ష్మీ దేవి, 26 తేధీన శ్రీ గాయత్రీ దేవి, 27 తేధీన శ్రీ వారాహి మాత, 28 తేధీన శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవార్లుగా భక్తులకు దర్శణమిస్తారు. 28 తేధీ ఆఖరు రోజున ఉదయం 11 గంటలకు జరిగే చండీహోమం పూర్ణాహుతితో జాతర కార్యక్రమాలు సంపూర్ణమవుతాయి.

# కాలనీలో మౌలిక వసతులు కల్పనలో విఫలమైన ప్రభుత్వం

## నిర్వాసితుల సమస్యలు పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు

## ఓట్లుమాత్రమేనా మా సమస్యలు పట్టవా అంటున్న నిర్వాసితులు




గోకవరం (జిఎస్‌బి వార్త) : ఒక పక్కన నవ్యాంధ్ర నిర్మాత నిత్య విద్యార్థి ప్రియతమ నేత నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఇటు ప్రజానాయకుడు పవన్ కళ్యాణ్, అటు యువత భవిత నాయకుడు లోకేష్. ఈ ఇద్దరి సహకారంతో ఆంధ్ర రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో పరుగులు పవట్టిస్తూ క్వాటం వ్యాలి, సీడ్ యాక్సిస్ రోడ్డు అంటూ రానున్న దశాబ్ద అవసరాలకోసం ఆలోచన చేస్తూ ముందుకు సాగుతుంటే పోలవరం నిర్వాసీతులకు మాత్రం కనీసం త్రాగునీరయినా అందక ఇబ్బందులు పాలవుతున్నామని వాపోతున్నారు. రాష్ట్రం పురోగమిస్తుంటే క్రిష్ణుని పాలెం ఆర్. అండ్. ఆర్ కాలనీ లో ఈ నాటికి మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అందులో పాలక, ప్రతిపక్షాల సీతకన్ను ఈ కాలనీ వాసుల దయనీయ స్థితే అద్దంపడుతుంది. సుమారు 1300 కు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టి మౌలిక వసతులు కల్పించ కుండా నాటి ప్రభుత్వం తరలించి వేస్తే నేటికీ కనీసం త్రాగునీరయినా అందిమ్ చకుండా చోద్యం చూస్తున్న నేటి పాలక పక్షం. 2024 లో సాధారణ ఎన్నికలకు నిర్వాసితుల ఓట్లు బదిలీలు చేసుకున్న ప్రభుత్వం నిర్వాసితులకు మౌలిక వసతులు కల్పించడం లో మాత్రం తమకు పట్టనట్టు వ్యవహారిస్తున్నారని నిర్వాసితులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. వెయ్యికి పైగా కుటుంబాలు, 18 గ్రామాలు నివాసం ఉంటున్న వ కాలనీలో కనీసం ప్రభుత్వ ఆసుపత్రి లేకపోవడం నిర్వాసితుల ఆరోగ్యం పట్ల విజనరీ లీడర్ ల మానవత్వం కనబడుతుంది. కాలనీలో ప్రథమ చికిత్స చేయడానికి అయిన సిబ్బంది లేకపోవడం గమనార్హం. పునరావాస కాలనీలో నిర్వాసితులకు హక్కుగా పూర్తిచేయవలసిన మౌలిక వసతుల్లో ఒక్కటైనా ప్రభుత్వ ఆసుపత్రి కట్టకపోవడం వల్ల ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్ళవలసి వాస్తుందని కాలనీ వాసులు తెలిపారు. అమరావతి కీ భూములు ఇచ్చిన రైతులకు ఇచ్చే ప్రాధాన్యం, దేశానికె తలమాణికమైన జాతీయ నీటిపారుదల ప్రాకేక్టు పోలవరం ప్రాజెక్ట్ కోసం పొలాలు ఇవ్వడం కాదు గ్రామాలకు గ్రామాలనే కాళీచేసి వేరే ప్రాంతాలకు తరిమివేయబడిన నిర్వాసితులకు మాత్రం పాలకుల నిర్లక్ష్యం మాత్రమే మిగిలింది. ప్రభుత్వాలకు ఎంత సేపు ప్రజా ఆస్తులపై హక్కులే కాదు, ప్రజల (nirvaasitula)బాధ్యత తీసుకోవాల్సిన అవరం ఉంది. అందుకు ఉదా హరణ నాడు దేవీపట్నం మండలం ఇందుకూరు అప్పటి ముఖ్యమంత్రి జగన్ రెడ్డి, వచ్చిన నేడు రంపచోడవరం చంద్రబాబు నాయుడు వచ్చిన నిర్వాసితులకు మౌలిక వసతులు పూర్తి చేయక పోవడం గమనార్హం. ఇందులో ఎవరు తక్కువ కాదు. నిర్వశితులను నిర్లక్ష్యం చేయడంలో ఇద్దరూ ఇద్దరే. తిలాపాపం తల పిడికెడు ఇందులో నిర్వాసితుల ఓట్లు పొందిన పాలకుల పాపం నిర్వాసితుల పాలిట శాపంగా మారింది. ముఖ్యంగా త్రా గు నీరు లేదు. ఇక్కడ కాలనీలో ఎక్కడ బోరువేసిన ఉప్పునీరే. లీటర్ 2 రూ చొప్పున కొనుక్కునే దుస్థితి దాపురించింది. సాగునీరు, త్రాగునీరు, విధ్యుత్ కోసం, వాణిజ్య అవసరాలు తీర్చడానికి గ్రామాలను కాళీ చేయించిన నిర్వాసితులకు త్రాగునీరు కరువు. వాళ్ళ నోట్లో ఉప్పునీరు పోసారు. కనీస ప్రభుత్వం మినరల్ వాటర్ ప్లాంట్ అయినా నిర్మాణం చేయక పోవడం స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం. పక్కనే గోదారి ఉన్నా దేవుపట్నం లో అప్పటి రాజ్యసభ మెంబర్ రత్నాబాయి మినరల్ వాటర్ ప్లాంట్ మాజూరు చేయించారు. ఈ కాలనీలో సత్యసాయి వాటర్ కోసం నాటి కాకినాడ పార్లమెంట్ మెంబర్ వంగా గీత వాటర్ ట్యాంక్ నిర్మాణము చేశారు. అయితే నేడు ప్రభుత్వం మాత్రం నిర్వాసితులకు త్రాగునేటికోసం నిధులు జీతాయించకపోవడం వారికీ ఆయా ప్రజా ప్రతినిధులకు క్రిష్ణుని పాలెం నిర్వాసితులపట్ల ఉన్న నిర్లక్ష్యనికి నిదర్శనం. కాలనీ నుండి బయటకు వెళ్ళాలాంటే 200 ఆటో పెట్టుకుని వెళ్ళాలి. సామాన్యులకు ఇది ఇబ్బంది కాదా? ఒక్కరోజు కొందరికి ఇచ్చే పించనునే ఇంటింటికి వెళ్లి ఇచ్చే ఉదార ప్రభుత్వం రోగం వస్తే మాత్రం చూపించుకోవడానికి ఆసుపత్రి, వైద్య సదుపాయాలు ఎందుకు కల్పించడం లేదని నీలాదీస్తున్నారు. నిత్యం త్రాగునీరు మనిషికి ఎంత అవసరం ప్రభుత్వానికి పాలకులకు తెలియదా. కాలనీ ఆర్చీ నుండి లోపల బస్సు రాని బస్టాండ్ వరకు చిమ్మ చీకట్లు. వీధి దీపాలు కరువు, మరోపక్క తాగుబోతుల సిట్టింగ్ లు చీకట్లో పురుగు, పుట్రా దాతుకుంటూ బిక్కు బిక్కుమని వెళ్ళవలసి వస్తున్నా కనీసం పట్టించుకోరు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉంది. ప్రాథమిక పాఠశాల నిర్మాణం మాత్రం చేయ లేదు. కమ్యూనిటి హాలులో పాఠశాల నడుపుతున్నారు. నిర్వాసితుల పట్ల అంత చిన్న చూపుకి కారణం ప్రభుత్వాలు చెప్పిన మాటలు నమ్మి గ్రామాలు కాళీచేయడమే నిర్వాసితులు పాలకుల కు చులకన గా కబడటానికి కారణమా? ఇప్పటికైనా కృష్ణుని పాలెం నర్వాసుతులకు మౌలిక వసతులు అయినా త్రాగునీరు, వైద్య సేవకు ఆసుపత్రి, పాఠశాల, ఆర్చీ వద్ద నుండి వీధిదీపాలు మొదలయినా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆ బాధ్యత ప్రభుత్వానికి ఎంత ఉందొ నిర్వాసితుల తరపున నిలబడి న్యాయం జరిగిలా ఛాయడంలో ప్రతి పక్షానికి అంతే బాధ్యత ఉంది.

# కవి సమ్మేళనంలో డా. తురగా



కాకినాడ (జిఎస్‌బి వార్త) : విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మల్లెతీగ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సృజనోత్సవం కవి సమ్మేళనం కార్యక్రమంలో కవి, నటుడు డాక్టర్ తురగా సూర్యారావు పాల్గొని కవితలు వినిపించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు నాటక అకాడమీ చైర్మన్ డా. గుమ్మడి గోపాల కృష్ణ, ఆంధ్ర నాటక కళా సమితి అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు, గిడుగు రామ్మూర్తి ముని మనుమడు గిడుగు వెంకట నాగేశ్వరరావు, చిన్ని నారాయణరావు, ఘంట విజయ కుమార్ డా బండ్ల రామ సుబ్బారెడ్డి మల్లెతీగ సంస్థ అధినేత కలిమిశ్రీ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా డా. తురగా సూర్యారావును ప్రశంశాపత్రం,జ్ఞాపిక లో సత్కరించారు.సూర్యారావు మాట్లాడుతూ ఈ అవార్డును తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నానన్నారు. సూర్యారావును పోస్టల్ పెన్సనర్స్, పోస్టాఫీసు ఉద్యోగులు, సీతారామరాజు కళా వేదిక సభ్యులు అభినందించారు.

# కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి...

## మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి సత్తిబాబు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి



కరప (జిఎస్‌బి వార్త) : కూటమి ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లడమే లక్ష్యంగా ‘ఇంటింటికీ తెలుగుదేశం’ కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నామని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి నేతృత్వంలో కరప మండల పరిధిలోని వేళంగి గ్రామంలో క్లస్టర్ ఇన్చార్జ్ మేడిశెట్టి పట్టాభి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస్ బాబాతో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొని ప్రతి ఇంటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. స్థానిక నివాసితులతో నేరుగా ముఖాముఖి మాట్లాడుతూ వారి అవసరాలు, సమస్యలను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల మేరకు ప్రవేశపెట్టిన ‘సూపర్ సిక్స్’ పథకాలు క్షేత్రస్థాయిలో అద్భుత ప్రజాదరణ పొందుతూ ‘సూపర్ హిట్’ అయ్యాయని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్న తీరు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని, రానున్న రోజుల్లో కూడా ఇదే ఉత్సాహంతో పాలన సాగుతుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కాకినాడ పార్లమెంట్ ఉపాధ్యక్షులు చుండ్రు వెంకన్న రాయ్ చౌదరి, మాజీ సర్పంచ్ పిల్లి కృష్ణ ప్రసాద్ (బుజ్జి), క్లస్టర్ ఇన్చార్జ్ మద్దూరి స్వామి, గ్రామ కమిటీ అధ్యక్షులు మేడిశెట్టి సత్యనారాయణతో పాటు కోటగిరి మహేంద్ర బాబు, గొల్లపల్లి బుజ్జి, గండి వెంకటేశ్వరరావు, వెలుగుల లచ్చారావు, మేడిశెట్టి కొండ, వాసంశెట్టి సుబ్బారావు, కొప్పిశెట్టి తలుపులయ్య, పలివెల జానకి రామయ్య, పంపన కన్నారావు, యాసలపు విష్ణు, కంటే సత్తిబాబు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు



గోకవరం (జిఎస్‌బి వార్త) : మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా జరిగే రోడ్ ప్రమాదాలను అరికట్టేందుకు ఆదివారం ఎస్సై బి. నాగమణి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై వి.ఎన్.వి. పవన్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో, రోడ్డు ప్రమాదాలను నివారించడం మరియు ప్రజల భద్రతను కాపాడే ఉద్దేశంతో ఈ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 4 గురిని గుర్తించగా, వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు, వారిని కోర్టులో హాజరుపరిచి జరిమానాతో జైలు శిక్ష విధించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి అమాయకుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున, వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా మరియు జాగ్రత్తగా వాహనాలు నడపాలని పోలీసులు సూచించారు.

# ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు



కాకినాడ (జిఎస్‌బి వార్త) : కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. 1872 ఆగస్టు 23న ప్రకాశం పంతులు గారు ఒంగోలు సమీపంలోని వినోదరాయునిపాలెంలో జన్మించారని తెలిపారు. న్యాయవాదిగా అపారమైన పేరు, సంపద సంపాదించినప్పటికీ, జాతి స్వాతంత్ర్యం కోసం తన వృత్తిని, సంపదను త్యజించి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని పేర్కొన్నారు. 1928లో సైమన్ కమిషన్ వ్యతిరేక ఉద్యమంలో బ్రిటిష్ సైనికుల తుపాకులకు ఎదురుగా ధైర్యంగా నిలిచిన ఆయన సాహసానికి గుర్తుగా ప్రజలు ఆయనను "ఆంధ్రకేసరి" అని పిలిచారని తెలిపారు. జాతీయ భావాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు "స్వరాజ్య" పత్రికను నిర్వహించారని, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారని గుర్తు చేశారు. 1946లో ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, అనంతరం 1953లో ఏర్పడిన ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా సేవలందించారని తెలిపారు. ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన ప్రకాశం పంతులు గారి త్యాగం, ధైర్యం, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎస్పీ గారు పేర్కొన్నారు. ఆయన సేవలకు గుర్తుగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాకు ఆయన పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్ గారు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ఎమ్ నరసింహ మూర్తి, కె వెంకటరావు, ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ డి దుర్గా శేఖర్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# డిసిసిబి కాకినాడ యూనిట్ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఎన్నికైన గాజింగం



కోరుకొండ (జిఎస్‌బి వార్త) : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా డీసీసీబీ కాకినాడ యూనిట్(ఏపీసిసిబిఈఏ)వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గాజింగం అప్పారావు ఎన్నికయ్యారు. గాజింగం అప్పారావు ప్రస్తుతం కోరుకొండ డిసిసిబి బ్రాంచి మేనేజర్ పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం రావులపాలెం నందు జరిగాయి. అందులో రాబోయే 3 సంవత్సరాల కాలంకు జరిగిన పానల్ లో కోరుకొండ డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ శ్రీగాజింగం అప్పారావు వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనందున అందరూ హర్షం వ్యక్తం చేశారు.

# ఎస్.కె నర్సింగ్ స్కూల్ విద్యార్థుల మధ్య ఘర్షణపై విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

## సిపిఎం కాకినాడ నగర కమిటీ డిమాండ్

## నర్సింగ్ విద్యార్థుల హాస్టల్స్‌లో భోజనం, వసతిలపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాలి

కాకినాడ (జిఎస్‌బి వార్త) : కాకినాడ వైద్య నగర్‌లో గల ఎస్.కె నర్సింగ్ స్కూల్ లో శుక్రవారం రాత్రి విద్యార్థినుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరినొకరు కొట్టుకునేదాకా వెళ్లడం చాలా బాధాకరమని సిపిఎం కాకినాడ నగర నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర నాయకులు మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ లు కొంతమంది విద్యార్థినుల తల్లిదండ్రులతో మాట్లాడినట్లు తెలిపారు. జరిగిన ఘటనపై ఎస్.కె నర్సింగ్ స్కూల్ యాజమాన్యం స్పందించాలని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. ఎస్. కె. నర్సింగ్ స్కూల్ లో విద్యార్థినులకు అందిస్తున్న ఆహారము రుచికరంగా, నాణ్యతగా ఉండడం లేదని, మంచినీటి సౌకర్యం కూడా సక్రమంగా లేదని అందువల్లనే విద్యార్థులలో ఒక రకమైన అలజడి ప్రారంభం అయినట్లు తెలుస్తోందన్నారు. ఆహార నాణ్యత బాగోలేదని మొబైల్ ఫోన్ ద్వారా వీడియో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో గొడవ ప్రారంభమైనట్లు తెలుస్తోందన్నారు. ఇది సహించలేని యాజమాన్యం వారు తమకు వ్యతిరేకంగా వీడియోను ఎవరు బయటపెట్టారని విద్యార్థినులను యాజమాన్యం వారే భయభ్రాంతులకు గురిచేసినట్లు, ఘర్షణ కూడా వారే ప్రోత్సాహించినట్లు కొంత మంది పేరు చెప్పడానికి ఇష్టపడని తల్లిదండ్రులు తెలిపారన్నారు. మణిపూర్ నుంచి వచ్చి చదువుకుంటున్న కొంతమంది విద్యార్థినులు ఈ విషయాలను బయటపెట్టారని, లోకల్ గా ఉన్న తెలుగు విద్యార్థినులను వారిపై ఘర్షణకు యాజమాన్యం వారే రెచ్చగొట్టినట్లు అనుమానం కలుగుతోందన్నారు. ప్రైవేట్ హాస్టల్స్ లో విద్యార్థునుల తల్లిదండ్రుల నుండి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు మాత్రం నాణ్యత గల ఆహారం, వసతి ఏర్పాటు చేయకుండా యాజమాన్యాలు వ్యవహరించడం సరైన పద్ధతి కాదన్నారు. కాకినాడలో ఉన్న ప్రైవేటు నర్సింగ్ హాస్టల్స్ అన్నింటిలోనూ జిల్లా అధికారులు పర్యటన చేసి విద్యార్థుల యొక్క స్థితిగతులను, వారికి అందుతున్నటువంటి సౌకర్యాలను పరిశీలన చేయాలని కోరుతున్నామని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు ఎక్కడా పునరావృతం కాకుండా చూడాలని జిల్లా అధికారులను సిపిఎం కోరుతుందని పలివెల వీరబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

# సహకార బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## డీసీసీ బ్యాంకును లాభాల్లో నడిపిస్తున్న చైర్మన్, సీఇఓలు



కాకినాడ (జిఎస్‌బి వార్త) : జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా తమ అసోసియేషన్ నిరంతరం పనిచేస్తుందని తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార ఉద్యోగుల సహకార సంఘం (ఏపీసిసిబిఇఏ) పేర్కొంది. బ్యాంక్ అభివృద్ధి, లాభాల్లో వెళ్లే విధంగా అహర్నిశలు పనిచేస్తున్న బ్యాంక్ చైర్మన్, సీఇఓలకు ధన్యవాదాలు తెలిపింది. అసోసియేషన్, బ్యాంక్ వివరాలను నాయకులు వెల్లడిం చారు. ఆదివారం కాకినాడ శాంతి నివాస్ భవనంలో దీనికి సంబం ధించిన వివరాలు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం క్రాంతి కృష్ణ, అధ్యక్షుడు పి కృష్ణమోహన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు జి అప్పారావు, ట్రెజరర్ కే పల్లవి విలేకరులకు వివరాలను వెల్లడించారు.తాము రెండు రోజుల క్రితం నూతనంగా 22 మందితో కమిటీని ఎన్నుకున్నామని చెప్పారు. జిల్లాలో ఉన్న 13 డిసిసి బ్యాంకులలో 12 వేతనాలు పెంచు కున్నాయని బ్యాంకు అప్పుల్లో ఉండడంతో తాము ఏరియర్స్ వదులు కొని జీతాలు ఇవ్వాలని అధికారు లను కోరామన్నారు. దీంతో తమకు రావలసిన 41నెలల ఏరి యర్లు బ్యాంక్ అభివృద్ధి కోసం ప్రస్తుతం తీసుకోలేనట్లు చెప్పారు. 18 కోట్ల టిడ్కో బకాయిలను కూడా చైర్మన్ చాలా వరకు తగ్గించినట్లు చెప్పారు. బ్యాంక్ అభివృద్ధికి ఉద్యోగుల శ్రేయస్సు కోసం సమావేశం ఎల్లప్పుడు పనిచేస్తుం దని క్రాంతి కృష్ణ, కృష్ణమోహన్, అప్పారావు, పల్లవిలు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు జిబి మనోహర్, ఐవస్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక



ఐ. పోలవరం (జిఎస్‌బి వార్త) : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ. పోలవరం మండలం జి. వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్‌జూనియర్, జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సెలక్షన్స్‌కు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధి నుంచి సుమారు 180 మంది బాలబాలికలు పాల్గొన్నట్లు అసోసియేషన్ సెక్రటరీ అడ్డగళ్ల నాగ రాంప్రసాద్ తెలిపారు. ఎంపికైన జిల్లా జట్లు విజయనగరం జిల్లా బొబ్బిలి, కడప జిల్లా పుల్లంపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్లలో పాల్గొంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ అప్పారావు, వైస్ చైర్మన్ నాగజ్యోతి, కోనసీమ SGF సెక్రటరీ కె. ఈశ్వరరావు, గొల్లపాలెం పీడీలు జి. సునీల్ కుమార్, ఇమ్మాన్యుయేల్ రాజ్, పీడీ కుంపట్ల శివ, ఆకుల ప్రసాద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను అభినందించిన నిర్వాహకులు, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

# మురమళ్ల పెట్రోల్ బంకులో మోసం

## రూ.450 పెట్రోల్ పోయించినా కిలోమీటర్ వెళ్లకుండానే బండి నిలిచిందంటున్న బాధితుడు



ఐ. పోలవరం (జిఎస్‌బి వార్త) : అసలే పెట్రోల్ ధరలు పెరిగి సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్న సమయంలో మురమళ్లలోని పెట్రోల్ బంకుపై ఓ వాహనదారుడు తీవ్ర ఆరోపణలు చేశారు. ఐ. పోలవరం గ్రామానికి చెందిన దంగేటి నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మురమళ్ల 216వ జాతీయ రహదారిపై ఉన్న పెట్రోల్ బంకులో తన బైక్‌కు రూ.450 విలువైన పెట్రోల్ పోయించుకున్నట్లు తెలిపారు. అయితే బంకు నుంచి మురమళ్ల సెంటర్‌కు చేరుకునేలోపే, కిలోమీటర్ దూరం కూడా వెళ్లకుండానే తన బైక్ ఆగిపోయిందని, పరిశీలించగా బైక్‌లో పెట్రోల్ లేదని గుర్తించినట్లు పేర్కొన్నారు. దీంతో ఆశ్చర్యానికి గురైన నాగబాబు తిరిగి పెట్రోల్ బంకు సిబ్బందిని ప్రశ్నించగా, సరైన సమాధానం ఇవ్వలేదని ఆరోపించారు. తనకు జరిగిన నష్టంపై బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు పెట్రోల్ బంకులోని సీసీ కెమెరా ఫుటేజ్, డెలివరీ రికార్డులు, మీటర్ రీడింగ్‌లను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. బాధితుడి ఆరోపణలపై పెట్రోల్ బంకు యాజమాన్యం వివరణ ఇవ్వాల్సి ఉంది.

# ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు

## స్పందించిన యువకులు



సామర్లకోట (జిఎస్‌బి వార్త) : సామర్లకోట నుంచి కాకినాడ వెళ్లే కెనాల్ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఆ వృద్ధురాలిని నలుగురు యువకులు మానవత్వంతో స్పందించి ఆసుపత్రికి తరలించారు. ఆదివారం సామర్లకోట మండలంలోని మాధవపట్నం గ్రామ సమీపంలోని కొత్త ఫ్లైఓవర్ వంతెన సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు రహదారిపై పడి ఉండగా, పలువురు వాహనదారులు పట్టించుకోకుండా వెళ్లిపోయారు. అదే సమయంలో సామర్లకోట నుంచి కాకినాడ వైపు వెళ్తున్న నలుగురు యువకులు ఆమెను గుర్తించి వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం ఆమెను కాకినాడ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. యువకుల మానవత్వపూర్వక స్పందనను ప్రయాణికులు అభినందించారు. కాగా ప్రస్తుతం బాధిత వృద్ధురాలి పేరు, చిరునామా వంటి వివరాలు తెలియరాలేదు. ఆమెను ఎవరైనా గుర్తించినట్లయితే లేదా కుటుంబ సభ్యులు, బంధువుల ఆచూకీ తెలిసినట్లయితే సామర్లకోట పోలీసులకు సమాచారం అందించాలని సామర్లకోట సిఐ ఏ కృష్ణ భగవాన్ కోరారు. ఆచూకీ తెలిసినవారు సామర్లకోట ఇన్‌స్పెక్టర్‌ను 9440796568 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. ప్రమాదాల్లో గాయపడిన వారిని చూసి ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించి సకాలంలో సహాయం అందించాలని యువకులు కోరారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో

# ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశాలు



రాజమహేంద్రవరం (జిఎస్‌బి వార్త) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC) ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎయిమ్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని స్కిల్ హబ్ నందు నిరుద్యోగ యువతకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఓ. నాగబాబు తెలిపారు. స్కిల్ హబ్ ద్వారా "అప్లికేషన్ డెవలపర్ – వెబ్ & ఫోన్ " కోర్సును ఉచితంగా అందించనున్నారు. శిక్షణ ద్వారా అభ్యర్థులకు సంబంధిత సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసి, శిక్షణ అనంతరం అర్హత కలిగిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు ఆసక్తి మరియు అర్హత కలిగిన యువత నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నిరుద్యోగ యువత, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఓ. నాగబాబు కోరారు.

# ఏలూరులో ఘనంగా ఓనమ్ వేడుకలు

## అలరించిన కేరళ నాట్య ప్రదర్శన



ఏలూరు (జిఎస్‌బి వార్త) : కేరళ సంప్రదాయ పండుగైన 'ఓనమ్' పర్వదినాన్ని పురస్కరించుకుని ఏలూరు తంగెళ్ళమూడిలోని శ్రీ వేణుగోపాలస్వామి వారి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ నాట్య గురువు శ్రీమతి సినీత వారి ఆధ్వర్యంలో వారి శిష్యబృందం అద్భుతమైన నాట్య ప్రదర్శన కనబరిచారు. కళాకారులు తమ సంప్రదాయ నృత్యరీతులతో భక్తులను,ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తిశ్రద్ధలతో సాగిన కార్యక్రమానికి స్థానికులు,భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రదర్శనను తిలకించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన నాట్య గురువు శ్రీమతి సినీత వారిని,వారి శిష్యబృందాన్ని ఆలయ నిర్వాహకులు,ప్రముఖులు అభినందించారు.

# ఓటర్ల జాబితా సవరణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## అదనపు కమిషనర్ కేటీ సుధాకర్



కాకినాడ సిటీ (జిఎస్‌బి వార్త) : ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (SIR-2026) ప్రక్రియలో భాగంగా అందే వినతులు, అభ్యంతరాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని కాకినాడ సిటీ నియోజకవర్గ ఎన్నికల అధికారి, అదనపు కమిషనర్ కేటీ సుధాకర్ ఆదేశించారు. నగరంలోని జీపీటీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గోవిందరావుతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో బూత్ లెవల్ అధికారులు (BLOలు), BLAల హాజరును పరిశీలించి, ఇప్పటివరకు నమోదైన దరఖాస్తులు మరియు వాటి పరిష్కార పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలను చేశారు మ్యాపింగ్ సాధ్యం కాని ఓటర్ల నుంచి అవసరమైన ఆధారాలు సేకరించి, క్షేత్రస్థాయి విచారణ అనంతరం వివరాలను రికార్డుల్లో నమోదు చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. పేరు, ఇంటిపేరు, బంధుత్వం, జనన తేదీల్లో వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల మేరకు సవరణలు చేపట్టాలి. తల్లిదండ్రులు మరణించిన కేసులు, వయస్సు సంబంధిత ప్రత్యేక కేసుల్లో అవసరమైన డిక్లరేషన్లు, ఆధారాలను పక్కాగా నమోదు చేసి, బీఎల్‌వో మరియు ఏఈఆర్‌వో స్థాయి విచారణ రికార్డులను స్పష్టంగా భద్రపరచాలి. ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల పరిధిలోకి వెళ్లకుండా, అర్హత ఆధారంగా ఒకే కేంద్రం పరిధిలో ఉండేలా చూడాలి. అలాగే వలస వెళ్లిన అర్హులైన ఓటర్ల హక్కులు కొనసాగేలా చర్యలు తీసుకోవాలి. గుర్తించిన ప్రతి నో-మ్యాపింగ్, అనమలీస్ కేసును నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని బీఎల్‌వోలను ఆయన స్పష్టం చేశారు.

# ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు సమైక్య సదస్సు



కాకినాడ (జిఎస్‌బి వార్త) : ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బార్ అసోసియేషన్ల అధ్యక్ష కార్యదర్శులు సమైక్య సదస్సు కాకినాడలో జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కమిటీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ( ఇంచార్జ్ అధ్యక్షుడు ) పెన్మాత్స రామచంద్ర రాజు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానంగా కోర్టులో సమయాన్ని ఆదా చేయడం, కోర్టులలో మౌలిక సదుపాయాలని పెంపొందించడం వంటి అంశాలపై సభ్యులంతా చర్చించారు. రాజమహేంద్రవరంలో గల ప్రిన్సిపాల్ జిల్లా న్యాయస్థానంలో జరిగే జుడిషియల్ కాన్ఫరెన్స్ బార్ అసోసియేషన్ సమస్యలు తెలియజేయుటకు అవకాశం కల్పించాలని సమావేశంలో తీర్మానించారు. వీటితోపాటు న్యాయవాదుల సమస్యలపై పలు న్యాయవాదు సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాకినాడ బార్ అసోసియేషన్ కార్యదర్శి చెక్కపల్లి చంటి, ఉపాధ్యక్షురాలు పి. సరోజిని జాయింట్ సెక్రటరీ నరేంద్ర స్పోర్ట్స్ అండ్ కల్చర్ సెక్రటరీ విజయ్ కుమార్ కార్యవర్గ సభ్యుల నాగబాబు, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కామరాజుపేటలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

## ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించిన తుమ్మలపల్లి రమేష్



గోకవరం (జిఎస్‌బి వార్త) : జగ్గంపేట నియోజకవర్గం గోకవరం మండలం కామరాజుపేట గ్రామం లో కామరాజుపేట జనసేన నాయకులు గొల్లంపూడి ఆనంద్ ఏర్పాటు చేసిన మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలకు జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ.. మెగాస్టార్ చిరంజీవి గారు కోట్లాది మంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానటుడు అని, సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడంతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. చిరంజీవి గారు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని, మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్,జనసేన నాయకులు, జనసైనికులు, మెగాస్టార్ అభిమానులు పాల్గొన్నారు.

# సత్యదేవునికి రూ. 62,000/- విలువైన వెండి శఠగోపం బహుకరణ



అన్నవరం (జిఎస్‌బి వార్త) : కాకినాడ జిల్లా, అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారికి ఆదివారం నెల్లూరు ప్రాంతానికి చెందిన యజ్ఞమూర్తి హరికృష్ణ,కళ్యాణి దంపతులు 211 గ్రాములు బరువు కలిగిన వెండి శఠగోపం బహుకరించారు. దీని వెల సుమారు రూ.62,000/- ఉంటుందని దేవస్థానం అధికారులు తెలిపారు.కార్యక్రమంలో అర్చకులు ఇంద్రగంటి సుధీర్, సీనియర్ అసిస్టెంట్ గణపతి ఉన్నారు.

# "షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామానికి చట్టం చేయాల్సిందే"

## ఏపీ ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ డిమాండ్




రంపచోడవరం (జిఎస్‌బి వార్త) : రంపచోడవరంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆత్మీయ కళ్యాణ మండపం హాల్ నందు శనివారంనాడు జిల్లా విస్తృత స్థాయి సమావేశం సరియం అనిల్ కుమార్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ATA రాష్ట్ర అధ్యక్షులు జలగం రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ముద్వల అమర్నాథ్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలోని షెడ్యూల్డ్ ఏరియాలో విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు స్థానిక ఆదివాసీ నిరుద్యోగులకే దక్కాలని, గౌరవ ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీ మేరకు "ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టాన్ని" తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. DSC- 2025 వల్ల ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, భవిష్యత్తులో కూడా ఇదే విధంగా ఉపాధ్యాయ నియామకాలు చేపడితే ఆదివాసీ ప్రజానీకాన్ని కలుపుకొని తీవ్ర స్థాయిలో పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే 1/70 చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, రంపచోడవరం షెడ్యూల్డ్ ప్రాంతంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ATA) ను మరింత బలోపేతం చేసి చట్టపరమైన హక్కులను సాధించుకుంటామని తెలిపారు. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతి గిరిజన పాఠశాలను విలీనం చేయకుండా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో భాగంగా పోలవరం నూతన జిల్లా ఏటిఏ కమిటీ ను ఏర్పాటు చేయడమైనది. పోలవరం జిల్లా అధ్యక్షులుగా సరియం అనిల్ కుమార్, మట్ల కృష్ణారెడ్డి, కోశాధికారిగా చిచ్చడి జితేంద్ర ఇంకా మహిళా అధ్యక్షురాలుగా డి కనకదుర్గ మరియు ఇతర జిల్లా కమిటీను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తెల్లం రాములు, కణితి శేఖర్, సరియం నాగేశ్వరరావు, సత్యనారాయణ రెడ్డి, సోడె నారాయణ, కణితి రామకృష్ణ, కట్టం వీరయ్య, సోదెం రాజులు మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

